జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 6

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ మాఘ మాసం - ఫిబ్రవరి 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతీ స్వామివారి విజయయాత్ర సందర్భంగా ఈTV విశాఖపట్నంవారి ఇంటర్వ్యూ

**ఈTV : స్వామీ!** ప్రపంచం ఒక Global villageలా తయారయ్యింది. అలాగే పాశ్చాత్య సంస్కృతి ప్రభావం మన యువత మీద విపరీతంగా ఉంటోంది. దాని నుంచి బయట పడలేకపోతు న్నాము. దానికి అలవాటు పడిపోతున్నాము. మా వృత్తివ్యాపారాలలో, ఉద్యోగాలలో దానిని అనుసరించక తప్పటంలేదు. దీని నుండి బయటపడే మార్గమున్నదా ? లేక దానిని కొనసాగించటమే మార్గమా?

**స్వామివారు :** లోకంతో కలసి ఉండాలన్నదే మన పద్ధతి. కానీ మన వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని మనం కాపాడుకోవాలి. దానికి మనస్సులో స్థైర్యం ఉండాలి. (stability) ధర్మంలో stability ఉండాలంటే మనలో ability ఉండాలి. Global village అన్నారు. నగరం అంటే వికాసమని, గ్రామం అంటే వెనకపడిన ప్రదేశమని అనుకుంటాం. మంచి గాలి, నీరు, నీడ గ్రామాలలోనే దొరుకుతుంది. అందుకని మనం గ్రామాన్ని కించపరచి చూడాల్సిన అవసరం లేదు. గ్రామంలో రాత్రిపూట అతిథి భోజనం చేయకుండా వస్తే అతనికి ఇంట్లో భోజనం పెడతారు. ఎవరైనా వస్తారేమో, బిక్షగాడు వస్తాడేమో, అడిగితే లేదని చెప్పకూడదని వారు సిద్ధంగా ఉంటారు. అతిథి అభ్యాగతులకు ఆతిథ్యం చేసే అలవాటు ఈ దేశంలో పూర్వం నుంచే ఉంది. వారం అని ఒక వ్యవస్థ ఉండేది. వేదం, శాస్త్రం చదువుకునేవాళ్ళకి



ఒక్కోరోజు ఒక్కొక్కళ్ళ ఇంట్లో భోజనం పెట్టేవారు. అలా ఆంధ్ర దేశములో వేదములను, శాస్త్రములను పోషించారు. Global village అన్నప్పుడు Globalగా ఎవరికి వాళ్ళు తమ అభివృద్ధిని మాత్రమే చూసుకుంటారు. స్వాతంత్ర్యము, సమత్వము, ఆదర్శము అనే తీపి మాటలు చెప్తారు. తీయని చర్యలు ఉండవు. అలా పాశ్చాత్యులు కొంచెం అందమైన మాటలతో వాళ్ళ పని చేసుకుంటున్నారు. దానిని మనం గుర్తించాలి. చాణక్యుడు పుట్టిన దేశం మనది. ఆయనది నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవితం. ఆయన అధికారంలోకి రావాలనుకోలేదు. తను చేయదలచినది చేసి తరువాత కుటీరంలో కూర్చున్నాడు. ఒక సదుద్దేశంతో తన తెలివితేటలని ఉపయోగించాడు. కాని స్వార్థం కోసం కాదు. అందరూ చాణక్యం అనే పేరు వాడుకొనటం సరికాదు. కలహం అనగానే నారదుడు అంటారు. నారదుడు అన్నిచోట్లకు వెళ్ళి భక్తి ప్రచారం చేశాడు. దుర్వాసమహాముని అంటే కోపం అంటారు. ఆయన కైలాసానికి వెళ్ళి అమ్మవారి ప్రసాదం తెచ్చి ఇంద్రునికి ఇచ్చాడు. ప్రసాదం అందరూ పంచుకోవాలని ఇంద్రుడు పరిపాలనామూర్తి కాబట్టి బలంగా ఉండాలని, ఆయనకు ఆశీర్వాదం, ప్రసాదం ఇచ్చారు. (ఆయన దానిని ఏనుగుకి ఇవ్వటం, ఆ ఏనుగు కిందపడేసి అవమానం చేసిందనేది వేరే వృత్తాంతం.) అందుకని మహర్షుల జీవితంలో వారి యొక్క ఉన్నతమైన ఆలోచనా దృక్పథం ఏమిటనేది మనం చూడాలి. మనం negetivityనే చూస్తాం. కాని సకారాత్మకమైన దృష్టితో పురాణాల్ని చూడాలి.

గ్రామంలో ఉండే అలవాట్లు మనం గమనించాలి. వాళ్ళు ఉదయాన్నే లేవటం, నిత్యకృత్యాల తరువాత భగవంతుని ధ్యానం చెయ్యటం, అతిథి సత్కారం, నిరాడంబర జీవితం, వినమ్రతతో స్నేహపూర్వమైన దయగల జీవితం, ఆర్ద్ర హృదయం ఇవ్వన్నీ ఉంటాయి. దీంట్లో ఆహారం కూడా ఒక ముఖ్యమైన పార్ట్. ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః అంటారు. మనస్సు యొక్క శుద్ధికి మనం తీసుకునే ఆహారం కూడా ఎంతో సత్త్వంగా ఉండాలి. తినే ఆహారం మంచి బలాన్ని ఇవ్వాలి. లలితా సహస్రనామంలో ఐదు విషయాలు చెబుతారు. తుష్టిః, పుష్టిః, మతిః, ధృతిః, శాంతిః అంటారు. తుష్టి అంటే సంతోషం, (happiness) పుష్టి అంటే శక్తి. పరిగెత్తడానికి, కొండలెక్కడానికి పుష్టికరమైన ఆహారం అవసరం. ఇంత ఉపవాసాలు, జపం చేసే మన కంచి మహాస్వామివారు షోలింగర్ రెండుకొండలు 85 ఏళ్ళ వయస్సులో ఎండాకాలంలో ఒక్కరోజులో ఎక్కారు. వారి సంకల్పం, శక్తి అటువంటివి. పుష్టి అంటే మంచి ఆహారం వల్ల వస్తుంది. Vitamins, Variety రెండూ కలిపి ఉండాలి. శాస్త్రీయమైన పద్ధతులూ ఉండాలి. భగవద్గీతలో సాత్త్విక, రాజసిక, తామస ఆహారం అన్నారు. మనకి తామసం నుండి రాజసం, రాజసం నుండి సాత్త్వికం అని ప్రమోషన్ రావాలి. ఆ ప్రమోషన్ రావడానికి ఆహారాన్ని భగవంతునికి నివేదనం చేసి తీసుకోవటం ముఖ్యమైన విషయం. అలా మనం భగవద్భక్తితో మనం ఉండి, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలను శుద్ధి చేసుకోవాలి. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ వ్యాపారం (చర్యలు) ధర్మంతో నడిపించాలి. దానికి మనం దినచర్యను మంచిగా ఆచరించాలి. ఆయుర్వేదంలో దినచర్య అధ్యాయంలో ఎంత నిద్రపోవాలి, నీరుతాగాలి, ఆహారంతినాలి అనే నియమాలను తెలిపారు. 'యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు' అని గీతలో భగవానుడు చెప్పారు. 'యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖ' అంటే మెలకువ అవసరం, నిద్ర అవసరం. రెంటినీ మనం జాగ్రత్తగా Balance చేసుకోవాలి.

ప్రభుత్వాలు, వ్యాపారసంస్థలు, తల్లిదండ్రులు సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాపారాలు, లాభాలు ముఖ్యమే అయినా మన ఆవాసము(ఇల్లు), ఆరోగ్యము, ఆలోచనలు, ఆహారము, ఆయుష్షు ఇంకా ముఖ్యము. కాబట్టి వీటికి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఎప్పుడైతే Cultural valuesకి మనం తగిన Importance ఇస్తామో అప్పుడు భారతదేశం తన గౌరవాన్ని స్థిరంగా నిలబెట్టుకుంటుంది. లోకానికి ఆదర్శంగా ఉంటుంది. Global village గురించి మనం వాళ్ళకు మనం నేర్పాలి. Science, Technologyలో మనం వాళ్ళ దగ్గర నుండి నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. సంస్కృతి, పిల్లల పెంపకం వంటి విషయాలలో వాళ్ళ దగ్గర నుండి మనం నేర్చుకోవాల్సిన అవసరం లేదు. దీనిని యువత గుర్తించాలి.


**ఈTV : స్వామీ! వృత్తివ్యాపారాలలో ఉన్న యువత వారాంతపు రోజుల్లో దేవాలయానికి వెళ్ళడమనేది ఒక అలవాటుగా చేసుకున్నారు. అయితే అందులో భక్తిభావంకన్నా ఒక పర్యాటక స్థలంగానో, సందర్శన స్థలంగానో చూస్తున్నారు. దీనివల్ల తిరుపతితో సహా అన్ని ప్రముఖ దేవాలయాలు రద్దీగా మారుతున్నాయి. ఈ విధమైన భక్తిని మనం ఎట్లా చూడాలి ?**

**స్వామివారు :** దేవాలయాలలో వసతులు కల్పించటం అవసరం కూడా! అదేమి ప్రమాదం కాదు. దాన్ని మనం ఎలా ఉపయోగించాలి? ఎంత వరకు తీసుకోవాలి? అని తెలియజెప్పాలి. ఒకరు ఆతిథ్యం ఇస్తుంటే మొత్తం తీసుకుంటామా – లేదుకదా! ఆ గౌరవం మనకు ఉంటుంది. ఈ దేశంలో ఇచ్చేవారికి కొన్ని లక్షణాలు, అలాగే పుచ్చుకునే వారికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. ఇచ్చి పుచ్చుకోవడాల్లో ఒక పద్ధతి

ఉంది. ఆచారసంహిత చెప్పిన దేశం మనది. వంట చేయాలన్నా, వడ్డించాలన్నా, భోజనం చేయాలన్నా, ప్రతి విషయంలో మానవ జీవితానికి ఒక Life Styleని సూచించిన దేశం మనది. దాంట్లో గౌరవం, ఆత్మగౌరవం కూడా ఉంటుంది. ఇతరులకి కూడా గౌరవాన్ని ఇస్తాము, అప్పుడే రౌరవం రాకుండా ఉంటుంది. ఇందాక Week-end అన్నారు మీరు, మనం weak కాకుండా ఉండటానికి ఈ Weekendని వాడుకోవాలి. 5రోజులు పనిచేస్తారు కాబట్టి కొంత విరామం అవసరం. శని ఆదివారాల్లో ఊర్జ(ఎనర్జీ) కావాలి. విరామంతో పనిచేసేటప్పుడు 'ఆత్మారామాశ్చయమని' అంటారు. అలా ఆత్మదర్శనం (Philosophy) అనేది కూడా చూసుకోవాలి. మన పురాణాలు, కావ్యాల గురించి తెలుసుకోవాలి. అక్షర రూపాలను మన భారతీయ సంస్కృతిలో ఆకర్షణ, కళ అని ప్రస్తుతి చేశారు కాని ధర్మానికి దూరం కాకుండా చూసుకున్నారు. ధర్మానికి విరుద్ధం లేకుండా కావ్యాలని, దృశ్యకావ్యాలని ధర్మప్రచారానికి వాడారు.

Self control అనేది అన్నింటిలో కావాలి. ఒక పుస్తకం ఇష్టమొచ్చినట్లుగా రాయకూడదు. నాటకం కూడా స్వకపోత కల్పితం అంటారు. మన బుర్రలో తోచినట్లుగా మనం చెయ్యకూడదు. సమాజ హితం కోసం చెయ్యాలి. వసతుల గురించి ఇప్పుడు మీరు చెప్పారు. ఆ రోజుల్లోనే మేము చెప్పాం. "తిరుపతిలో కాంతి, తెలంగాణాలో శాంతి" అని. కాంతి అంటే ఊటీ, కొడైకెనాల్ లాగా డెవలప్ చెయ్యటం కాదు. భక్తులకు భోజనం, నిద్ర, స్నానం, బట్టలు మార్చుకోవడానికి వసతి కావాలి. పరిమితమైనవే చెయ్యాలి. భక్తులు కూడా పరిమితమైన వసతులే కోరుకోవాలి. మన వేషభూషణాలు కూడా సంప్రదాయ రీతిలో ఉండాలి.

మన పెద్దల గురించి గొప్పభావన ఉండాలి. తాతగారు, నానమ్మ, అమ్మమ్మలు చదువుకోలేదని, ఏమి సాధించలేదని, మనమేదో ఇంగ్లీషు చదువు చదివి గొప్పవారమయ్యామని అనుకోరాదు. వారిని గురించిన న్యూనతాభావంలో మార్పు రావాలి. ఈరోజు వసతులు వచ్చాయి. కంప్యూటర్, విమానం లాంటి సౌకర్యాల వలన అనుకూలంగా ఉంటున్నది. అందుకని మన తాతల గురించి తక్కువ అనుకోవటం సరికాదు. కొంతమంది యువత పెద్దలను గౌరవిస్తున్నారు. వాళ్ళ పేరుతో గుడులు కట్టిస్తున్నారు, దానధర్మాలు చేస్తున్నారు. మనదేశంలో ఈరోజుకీ కుటుంబ వ్యవస్థ అనేది మంచిగా ఉంది. కానీ అది పూర్ణంగా ఉండాలి. మనం ఇతర దేశాల వారితో పోల్చుకోవాల్సిన అవసరం లేదు. ఎన్నో భాషలు, ప్రదేశాలు, శీతోష్ణములు, ఆర్థిక పరిస్థితులు, ఆటంకాలు, ఆటలు ఉన్నా ఈ దేశం ఏకంగా ఉంది. ఈ దేశంలో తల్లిదండ్రులను గౌరవంగా చూస్తారు. ఇంటిలోనే పెట్టుకుని చూసుకుంటున్నారు. కుటుంబసభ్యత



ఉంది. కొన్ని లోపాలు, లోభాలు కనిపిస్తున్నా, మొత్తానికి బావుంది. ఇంకా బాగా చెయ్యటానికి మనం ప్రయత్నం చెయ్యాలి.

ఆశ అనేది మనిషికి సహజం. కానీ ఇప్పుడు ఆశలు పెరిగి అవకాశాలు తగ్గాయి. దీనిని మార్చాలి. ఆశలు తగ్గించి అవకాశాలు పెంచాలి. యువత ధర్మాన్ని తెలుసుకోవాలి. మన సంస్కృతి గొప్పదనం గుర్తించాలి. వాళ్ళతో వీళ్ళతో పోల్చుకోకూడదు. Comparitive studies సైన్సులో పనికి వస్తుంది కానీ Cultureలో పనికిరాదు. వెయ్యి సంవత్సరాలు ఇబ్బందికి గురై, సమగ్ర భారతం ముక్కలై కొన్ని దేశాలుగా విడివడినా ఇప్పటికీ మనకు పెద్ద భాగమే ఉన్నది. శాంతి, భద్రత, సురక్ష మనకి ఇప్పుడు ముఖ్యం. ఆ దృష్టితో మనం దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి బాగా పెంచుకోవాలి. ఎవరికివారు మంచి గురువుని తెలుసుకుని గురుముఖత విద్య నేర్చుకోవాలి. వీడియోలు, పుస్తకాలు ఉన్నాయి, ఇంక గురువుతో అవసరం ఏమిటని భావించరాదు. ఉదాహరణకు యోగా సరైన గురు మార్గదర్శకత్వంలో నేర్చుకోకపోతె వేరెక్కడికో తీసుకుపోతుంది. అందుకని గురువు ఆదేశంతో, నిర్దేశంతో ధర్మాన్ని మనం తెలుసుకుని ఆచరించాలి. దానికొరకు ముందు మంచి గురువులను మనం తయారుచెయ్యాలి. గురువుగారి దగ్గరకు వెళ్ళి వీళ్ళు నేర్చుకోవాలి. సంస్కృతి పాఠశాల అని మొదలు పెడుతున్నాము. యువత శని ఆదివారాల్లో వాటిని చక్కగా వినియోగించుకోవాలి. మన భారతీయ విజ్ఞానం, అష్టదిక్పాలకులు, ఆయుర్వేదం, సంగీతం–రాగాలు, సనాతనధర్మము లాంటివన్నీ తెలియజేస్తారు. సనాతనధర్మ పరిచయవేదిక అని, సంస్కృతి పాఠశాల అని యువతకి Exposure, Experience, Expertise లను పరిచయం చేసూ భాగ్యనగరంలో (Hyderabad) చిన్నగా మొదలు పెట్టాము. పద్ధతి అని ఒక పాఠశాల కాకినాడలో మొదలు పెట్టాము. శని ఆదివారాల్లో యువత వచ్చి దేశం, ధర్మం, తెలుసుకుని ప్రేమమార్గంలో ధర్మాన్ని నడిపించడం తెలుసుకోవాలి. (ఈ ప్రేమ కోసమే వీళ్ళు అక్కడికి, ఇక్కడికి వెళ్ళేది.) సౌఖ్యము, ప్రేమ, లాలిత్యము, ధర్మబద్ధమైన విధంలో మనం ఇస్తే యువత మనవైపు ఉంటారు. మనకి కూడా ధర్మప్రచారం చేసిన సంతృప్తి ఉంటుంది. ఆ సమాజం సురక్షితంగా ఉంటుంది.

యువత చేతికి మనం ఆస్థులను ఇస్తున్నాము. ఆస్థులను ఇవ్వటం మంచిదే. ఆస్థులతో పాటు ఆస్థిక్యం కూడా ఇవ్వాలి. ఆస్థులు, ఆస్థిక్యం కలిస్తే మన భారతదేశం గొప్పగా ఉంటుంది. అందులో దక్షిణభారతదేశంలో మన ఆంధ్రదేశం ధర్మప్రచారంలో ఇంకా ముందుగా ఉండి అనేక కార్యక్రమాలు చెయ్యాలి. అందుకని 'సంస్కృతి' పాఠశాల విషయంలో తల్లిదండ్రులు పిల్లలను చిన్నవయస్సు నుంచే ప్రోత్సాహం చేసి, రామనామ లేఖనం, ఇతర విషయాలు తెలుసుకొనే అవకాశం కల్పించాలి. ఇక్కడ మన యాత్రలో గోదావరి సందర్శనం చేశాము. ఇప్పుడు విశాఖపట్నంలో ఉన్నాము. స్కూలుకు వెళ్ళే చిన్న పిల్లలు వచ్చి చంద్రమౌళీశ్వరస్వామి పూజ దర్శనం చేసుకుంటున్నారు. తీర్థప్రసాదాలు తీసుకుంటున్నారు. ఇలాంటి అవకాశాలు మనం కల్పించాలి.

ఆశ అనేది తప్పుకాదు. అది అత్యాశగా మారకూడదు. నిరాశగా ఉండకూడదు. సంబంధం లేకుండా స్వప్నలోకంలో ఉండకూడదు. స్వర్గలోకం మనకి కావాలి కాని స్వప్నలోకం అవసరం లేదు. అందుకనే నిజదర్శనం, నిజపాద దర్శనం అని అంటారు. అంటే సత్యాన్ని, నిజాన్ని తెలుసుకోవటమే మన సనాతన హైందవ ధర్మం యొక్క లక్ష్యం. సత్యాన్వేషణం అనేది ముఖ్యం. మన గురించి తెలుసుకోవాలి అంటే మనం మనలాగే ఉండాలి. భగవంతునికి నమస్కారం చేస్తే మనస్సు అనేది పరిణామ వికాసాన్ని పొందుతుంది.

**ఈTV : స్వామి ! యువతని అనేక ప్రలోభాలు నిత్యం ఆహ్వానాలుగా ఊరిస్తున్నాయి. వారిని నిగ్రహంగా తమ లక్ష్యంవైపు చేరుకోవడానికి మీరు వారికి వచ్చే ఉపదేశం ఏమిటి?**

స్వామివారు : ఆహ్వానం వచ్చిన ప్రతీచోటికీ మనం వెళ్ళాలి అనేది ఏమీలేదు. కొన్ని సందర్భాలలో మనకి ఆహ్వానం లేకపోయినా మనం వెళ్ళాలి అని మనకి శాస్త్రం చెబుతున్నది. 'అనాహూతః అధ్వరం గచ్ఛేత్' అని అంటారు. ఆహ్వానం లేకపోయినా కొన్ని మంచి విషయాలకు మనంతట మనం వెళ్ళాలి. ఆహ్వానం వచ్చిందని అక్కడికి (ప్రలోభ పెట్టే విషయం వైపు) వెళ్ళడం సరికాదు. భగవద్గీతలో చెప్పినట్టుగా 'తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మకర్తుమిహార్హసి' ఏదైనా పని చెయ్యవచ్చు, చెయ్యకూడదు అనే దానికి నియామకంగా ఉండేది ధర్మం, శాస్త్రం. సైన్స్ అనేది వైజ్ఞానికమైతే ధర్మం అనేది సాముదాయికం, విశ్వాసాత్మకం. మనధర్మం అనేది తల్లిదండ్రులను గౌరవిస్తుంది. అందరికీ అన్నదానం చెయ్యమంటుంది. చలివేంద్రం పెట్టి నీళ్ళు, మజ్జిగ, నీడ ఇవ్వమని చెప్తుంది. అలా ఉదారమైన దృక్పధం, వినమ్రతను కలిగిస్తుంది. ఎవరికైనా అహంకారం అనేది సమాజపరంగా, దేశపరంగా ఉండొచ్చు కానీ వ్యక్తిపరంగా ఉండటానికి స్థానం లేదు. ఈ విషయాన్ని భారతీయ సనాతనధర్మం మనకి గట్టిగా చెబుతోంది. అందుకని ఆహ్వానం వచ్చిందని అటువైపు (ప్రలోభాల వైపు) వెళ్ళకుండా యువత భగవద్గీత నేర్చుకోవాలి. ప్రభుత్వం కూడా కొన్ని చర్యలు చేస్తున్నట్టుగా విన్నాము. ప్రభుత్వం మాత్రమే కాకుండా

తల్లిదండ్రులు కూడా భగవద్గీత నేర్చుకోవటానికి ప్రోత్సహించాలి. ఆలయాలు, స్వచ్ఛంద సంస్థలు మంచిపండితుల ద్వారా ప్రవచనాలు ఏర్పాటు చేయించి నెమ్మదిగా వాళ్ళకి నేర్పించాలి.

**'శనైః శనైః ఉపరమేత్ బుద్ధ్యా ధృతి గృహీతయా**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్'**

తపస్సు, సత్సంగం అనేవి ఒకరోజులో వచ్చే విషయం కాదు. అందుకని తరచూ వాళ్ళకి ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యాలి. భారతీయ సనాతనధర్మంలో ఉన్న ఆయుర్వేదం, జ్యోతిష్యం, గణితము, అంతరిక్షశాస్త్రం, 18పురాణాలు, ఉపపురాణాలు, స్థలపురాణాలు, రామాయణభారతభాగవతాలు, వీటినన్నింటినీ బాగా విస్తృతంగా, సరళంగా, ప్రజలందరూ అర్థంచేసుకునే విధంగా మంచి పండితులచే సత్సంగాలు శని,ఆదివారాలలో ఏర్పాటు చేసి ధర్మప్రచారం చెయ్యాలి. గుళ్ళలో అలంకారాలు, అభిషేకాలు, పూజలు జరుగుతున్నాయి. అక్కడితో సరిపెట్టుకోక ధర్మప్రచారం జరిగేటట్టుగా మనం ఏర్పాటు చేసుకోవాలి. వాటికీ ఒక కోర్సులా చేసి సర్టిఫికెట్లు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటం వంటివి చెయ్యాలి. ధర్మవిద్యతోపాటు శాస్త్రీయ సంగీతం, నాడీశాస్త్రం వంటివి కూడా శిక్షణ ఇచ్చి సంస్కృతిని మనమే పెంపొందించుకోవాలి. చతుఃషష్టికళలు (64కళలు) అంటారు. ఇవి concentration power పెరగటానికి బాగా ఉపయోగ పడతాయి. ధర్మాన్ని ప్రచారం చెయ్యాలి అంటే మన సనాతన హైందవ ధర్మంలో బోలెడు subject ఉంది. దానికి Presentation, Distribution అవసరం ఉంది. క్రమశిక్షణతో పాటు క్రమసహా శిక్షణ కూడా కావాలి. ఒక్కసారే అన్ని చెయ్యాలి అని కాకుండా పాక్యేజ్‌గా విడదీసి పాఠ్యాంశం తయారుచేసి ప్రతిగుడిలో కూడా ప్రచారం చెయ్యాలి.



గుడులలో రెండు ముఖ్య విషయాలు. వసతి ఏర్పాట్లు, గుడిబయట చెప్పులు, సామాన్లు పెట్టుకునేందుకు, తిరుపతిలో ఉన్నట్లు కాళ్ళు కడుక్కునే ఏర్పాటు, ప్రసాదాలు మొదలైనవి భక్తుల అవసరాలు గుర్తించి చేయాలి. భక్తులు కూడా ఒక అర్ధగంట కూర్చుని ఏదైనా ధర్మానికి సంబంధించిన విషయాలు చర్చించుకోవాలి. వాళ్ళు జపం, నామజపం, భజన, సుందరకాండ వంటి పారాయణలు చేసుకోవాలన్నా ఏర్పాట్లు చేయాలి. ధర్మశాస్త్ర ప్రచారం మనం చేస్తున్నాం. గుడులు దర్శించుకోండి అని చెప్తున్నాం. ఆంధ్రదేశంలో 'మనగుడి' వంటి కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. దాంతోపాటు ధర్మప్రచారానికి ఉద్యమం చెయ్యాలి. యువతలో శక్తి వ్యర్థం కాకుండా మార్గదర్శకత్వం కావాలి. ఆ శక్తి నిరుపయోగం, దురుపయోగం కాకుండా నిర్మాణ శక్తిగా, creativeగా మార్చాలి.

**'వయోరూప విభూతీనాం ఏకైకం మదకారణం**
**తాని యస్మిన్ సమస్తాని న తస్య ఉచ్ఛిషిచే మనః'**

రాములవారి యొక్క వంశం గురించి చెప్తూ చిన్న వయస్సు, – బాగా పనిచెయ్యటానికి అనుకూలంగా ఉంటుంది. రూపం – ఆకర్షణీయమైన సౌందర్యమైన రూపం. విభూతి – ఉంటే బాగా సంపాదిస్తారు, ఉత్సాహంగా ఉంటారు. ఈ మూడు developmentకి అనుకూలమైన విషయాలు. కాని అది దురుపయోగమైతే వికాసం లేక పోగా సమాజానికి హాని కలిగిస్తుంది. అందుకని వారికి దిశానిర్దేశం చేసే అవసరం ఉంది. పరిపక్వత, పాండిత్యం కలిగిన పండితులతో దేవాలయ కమిటీలు చర్చించి ధర్మప్రచారం అనేది ముఖ్యకార్యక్రమంగా పెట్టుకుంటే మనదేశంలో ఉండే యువశక్తిని మనం లోకోపకారకంగా మార్చుకునే అవకాశం ఉంది. అందుకని మీరు చెప్పినట్టుగా ఏది కనపడితే దాన్ని, ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో

ప్రసారమయ్యే ప్రతిదానిని చూడాలని ఏమిలేదు. ఎన్నో తెలిసినా చూడకుండానే తపస్సు చేసి మనవాళ్ళు గొప్పలక్ష్యాలు సాధించారు. అది మన భారతీయ చరిత్ర. వినేది, చూసేది, వెళ్ళేది, తినేది ధర్మబద్ధంగా ఉండటం అనేది భారతీయ సంస్కృతి. తాత్కాలికంగా, స్వల్పకాలానికి కొన్ని మనకు ఉపయోగపడినట్లున్నా దీర్ఘకాలానికి ఉపయోగపడేది మాత్రం ధర్మం ఒక్కటే. దానిని మనం విశదీకరించి ప్రస్తావన, ప్రస్తుతి చెయ్యాలి. ఇది ఇప్పుడు అవసరం. యువతలో open mind ఉంది. మంచి చెబితే స్వీకరించే మనస్తత్వం ఉంది. వాళ్ళు కొత్త విషయాలను తీసుకుంటారు కాబట్టి మనం ప్రాచీన ధర్మాన్ని నవీకరణం చేసి, పాలిష్ చేసి అందంగా, మృదువుగా చెప్పాలి. (సహస్రాబ్ది ఉత్సవాలప్పుడు తెలుగు మహాభారతంలోని వంద పద్యాలని సెలక్ట్ చేయించి పాఠశాల పిల్లలకు నేర్పించే ప్రోగ్రామ్ చేశాము. 250 స్కూల్స్ విద్యార్థులు చక్కగా నేర్చుకున్నారు.) ప్రచరంలో భక్తి సాహిత్యము, బుర్రకథ, తోలుబొమ్మలాట, ఆటలు, పాటలు అన్నీ వాడుకోవాలి. ఇవన్నీ పుణ్యానికి సంబంధించిన కళలు. 'సంగీత సాహిత్య కళా విహీనః సాక్షాత్ పశుః పుచ్ఛ విషాణ హీనః' సంగీతం, సాహిత్యం అనేవి మన జీవితంలో మనస్సులో బరువు లేకుండా, అహంకారం లేకుండా, స్నేహభావంతో ఉండటానికి, ఆహ్లాదంతో ఉండాటానికి సహకరిస్తాయి. అందుకని మనం వీటిని ధర్మబద్ధంగా ప్రోత్సహించాలి. మనం జడంలో చైతన్యం తీసుకువచ్చాం. గతంలో నుండి ప్రగతిని సాధించాం. లోహంలో మనం ఒక మార్పు తీసుకునివచ్చాం. ఒక టైప్ రైటర్, ప్రింటర్, కంప్యూటర్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇవన్నీ మనం సాధించాం. కాని నవ్వు, మనసు ఆర్టిఫిషియల్‌గా ఉంటే ఎలా? పనిచెయ్యడానికి ఆర్టిఫిషియల్ వాడతారు కాని ప్రకృతి ఆర్టిఫిషియల్‌గా ఉండకూడదు. ఆ ప్రకృతిని మన దేశంలో ధర్మంతో నిర్మాణం చేస్తారు. అందుకే దయాదాక్షిణ్యం ఉంటాయి. ఆవులను, చెట్లను కాపాడతారు. మంచిగాలి, నీరు ఉండాలి. సౌహార్దము, సౌజన్యము కలిగించాలంటే భక్తి, ధర్మము, సదాచారము మనకు చాలా ముఖ్యము. దీంట్లో సైడ్ఎఫెక్ట్స్ ఉండవు. వెంటనే ఫలితం లేకపోయినా దీర్ఘకాలిక, నిరంతర ఫలితాలు దీంట్లో ఉంటాయి. అందుకని ధర్మప్రచారం సదుద్దేశంతో చెయ్యాలి.

**ఈTV : ప్రతి ఏటా జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. దేశ యువత ఇప్పుడు రకరకాల సవాళ్ళకు, సమస్యలకు సమాధానం వెతుక్కుంటూ తమ పయనాన్ని ఉక్కిరిబిక్కిరిగా సాగిస్తోంది. ఈ తరుణంలో వారు ఏ మార్గాన్ని ఎంచుకోవాలి అనే సందిగ్ధత, అనిశ్చితి ఎదురు అవుతున్నాయి. వాటి నుండి బయటపడటానికి, సరైన మార్గం ఎన్నుకోవటానికి వారికి పలు సవాళ్ళు ఎదురు అవుతున్నాయి. దేశ అభివృద్ధికి వారియొక్క పాత్రని ఎలా నిర్వర్తించాలి. యువతను ఇన్ని రకాలైన ఆకర్షణలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఈ క్రమంలో వారు అనుసరించాల్సిన మార్గం ఏమిటంటారు?**

**స్వామివారు:** ఆధునికం అన్నప్పుడు నవత అనేది ఉంటుంది. నూతనం తప్పు, ప్రమాదం కాదు. కానీ మన శాస్త్రానికి, ప్రాచీన సంప్రదాయ సంస్కృతికి వ్యతిరేకం కాకుండా ఉండాలి. నవత ఉండబట్టే ఈరోజు ఇవన్నీ సులభం అయ్యాయి. దాంట్లో సందేహం లేదు. అదే సందర్భంలో మన కుటుంబవ్యవస్థ నుంచి గ్రామీణ అభివృద్ధి వరకు కోరుకునే మంచివిషయాలలో కొంచెం తేడా కూడా కనిపిస్తోంది. దీంట్లో నవతతో పాటు మానవత కూడా ఉండాలి. నవత అనేది మన సత్సంప్రదాయాలకి అనుకూలంగా లేకపోతే అది వ్యతగా అయిపోతుంది. ఈ ఒక్క దేశం అనే పరిమితి లేకుండా లోకంలో ఉండే అన్ని దేశాలు ధర్మాన్ని పాటించాలి. అప్పుడే మీరనుకున్నట్లుగా యువతలో మార్పు కనిపిస్తుంది. మనవాళ్ళు 20శాతం ఉంటే ఇతర దేశస్థులు 80శాతం కాబట్టి వారి ప్రభావం మనమీద ఉంటుంది. అందువల్ల ధర్మప్రచారం మన ఒక్కదేశంలోనే కాదు ఇతరదేశాల్లో కూడా జరగాలి.

ఈ రోజు మీరు యువతా దివస్ అని ఏరోజు గురించైతే అంటున్నారో ఆయన పరిశ్రమ, ఆహ్వానం లోకంలో ఒక మంచి మార్పు తెచ్చి ప్రజలందరినీ ధర్మంవైపు, వేదాంతంవైపు, సేవా కార్యక్రమాలవైపు తీసుకువెళ్ళింది. సనాతనధర్మ సంస్కృతిలో వివరంగా పనిచేస్తూ, మన శాస్త్రాలని, ధర్మాలని మనం కాపాడుకోవాలి. మన ధర్మానికి ఇబ్బంది కలిగించకుండా ఉంటే రాబోయే రోజుల్లో అందరికీ కూడా అనుకూలంగా ఉంటుంది. తాత్కాలిక ప్రయోజనాలకి, మనదేశాన్ని కేవలం వ్యాపారదృష్టితో చూడకుండా, ఇక్కడ ఒక సంస్కృతి, సభ్యత, వైజ్ఞానికమైన, సాత్త్వికమైన, శాస్త్రీయమైన, సత్యాన్వేషణతో కూడిన జీవనవిధానం ఉంది అనేది వాళ్ళు కూడా గుర్తిస్తే మనం ఆ దేశాల్లో కూడా గౌరవించబడతాం. మనదేశం ఎవరికీ వ్యతిరేకమైనది కాదు. కానీ ఎవరూ వ్యతిరేకులు కాకుండా చూసుకోవాలి. ఆ విషయంలో మనకి చాలా దేశభక్తి కావాలి. ముఖ్యంగా చుట్టుపక్కల ఉండే దేశాలతో సత్సంబంధం కలిగి ఉండటం చాలా అవసరం. దీనివల్ల వాళ్ళకీ, మనకీ మంచిదన్న విషయాన్ని గమనించాలి.

లోకవ్యాప్తంగా ధర్మప్రచారాన్ని భారతదేశం చెయ్యాలి. భగవద్గీత



సందేశాన్ని అందరికీ చెబుతూ తద్వారా అన్ని దేశాల శాంతికి మూలకారణం అయిన ఈదేశం ఇంకా ఉన్నతమైన స్థాయికి చేరుకునే విధంగా శ్రమించాలి. యువత మనస్సులో సందేహం అవసరం లేదు. కుటుంబం, గుడి, తల్లిదండ్రులు ఈ విషయాలలో మన భారతదేశ పరంపర ఏదైతే ఉందో అదే ముఖ్యమైనది, దృఢమైనది కూడా. అదే గొప్పదనే స్థిరనమ్మకం మనలో ఉండాలి. వైజ్ఞానికంగా (Science, Technology) కొత్త విషయాలు ఏమైతే ఉన్నాయో వాటిని ప్రవేశ పెట్టుకుని దేశ ఉన్నతికి కృషి చెయ్యాలి.

**ఈTV : యువజన దినోత్సవం సందర్భంగా మీరిచ్చే మహదాశీర్వపూర్వక సందేశం ఏమిటి?**

**స్వామివారు :** యువత సంఖ్యాబలం చాలా ముఖ్యం అంటున్నారు. 35శాతం యువత దేశ భవిష్యత్తు అంటున్నారు. ఆశావాదాన్ని తప్పుపట్టటం లేదు. మంచివిషయమే. కాని ఈ యువత ఆనందంగా, ఆరోగ్యంగా, ఆచారంగా, ఆత్మీయంగా ఉండాలి. ఆత్మదర్శనం జీవితం యొక్క ముఖ్య లక్ష్యంగా పెట్టుకోవాలి. ధర్మమార్గం జీవితంలో చాలా అవసరం అనేది యువత చిన్నవయస్సులోనే గుర్తించాలి. షష్టిపూర్తి అయిన తర్వాత వీరు పురాణాలు, గుడులు తెలుసుకునే బదులుగా చిన్నవయస్సులోనే ధర్మము, విజ్ఞానం, వికాసం అనే మూడింటి మధ్య జాగ్రత్తగా Balance చేసుకోవాలి. ఒకదానిని వదిలి ఇంకొకటి చెయ్యకూడదు. అన్నింటినీ కలుపుకునేదే భారతీయ సంస్కృతి. కానీ ఎంత అనే దాన్ని మనం సరి చూసుకోవాలి. ఉగాది రోజు పచ్చడి రుచులను జీవితంలో అన్వయం చేసుకోవాలి.

**'శతాయుః వజ్రదేహాయ సర్వసంపత్కరాయ చ**
**సర్వారిష్ట వినాశాయ నింబకందల భక్షణం'**

మన కంచి మహాస్వాములవారు ఈ శ్లోకాన్ని ఉగాదిరోజు అందరికీ చెప్పించమన్నారు. 'శతాయుర్ వజ్రదేహాయ' దీర్ఘాయుష్షు, పూర్ణాయుష్షుతో ఉండటానికి మన ఆహారము, ఆలోచన, అలంకారము, అభిప్రాయము అన్ని అనుకూలంగా ఉండాలి. 'సర్వ సంపత్కరాయచ' మంచి ఇల్లు, సౌకర్యాలు,

వాహనవసతులు ఉండాలి. 'సర్వారిష్ట వినాశాయ' మనకు జీవితంలో ఎదురయ్యే కలహాలు కాకుండా కుటుంబ సమైక్యత ముందు చూసుకోవాలి. అది ఈ రోజు యువతకు చాలా ముఖ్యము. కుటుంబములో ఉండే సమైక్యతే వాళ్ళకి స్థైర్యం, ధైర్యం, మంచిభక్తిని ప్రసాదిస్తుంది. మనస్సులో శాంతి కలిగితేనే లోకంలో శాంతి కలుగుతుంది. ఇంటింటికి శాంతి ప్రచారం చెయ్యటానికి మనం ముందు ప్రశాంతంగా ఉండాలి. Style Life నుండి Life Styleకి మారాలి. అలా యువత మారితే వారిలో ఉండే శక్తి వృధా కాకుండా లోకానికి ఉపయోగపడుతుంది. వాళ్ళు బాగా పనిచేస్తున్నారన్నదాంట్లో ఎటువంటి సందేహం లేదు. కానీ దాంట్లో కొంచెం నిదానం కూడా కావాలి. యువతలో దానం ఉంది, దానితోపాటు నిదానం కూడా కావాలి.


### Merit, Magnanimity, Maturity :

Merit, Magnanimity, Maturity. Merit అంటే మంచిగా Post Graduations, Phdలు చేయండి తప్పేమీ లేదు. Magnanimity – అందరినీ గౌరవించండి. Maturity అంటే మీరు sudden నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోండి. సులగ్నే సావధాన అంటారు. సావధానంగా వెళుతూ cautions, precautions పాటించాలి. ఇలా చేస్తే భారతదేశ ప్రజ ముఖ్యంగా యువత లోకానికి ఉపయోగపడుతుంది. మనవాళ్ళు విదేశాలలో గొప్పస్థాయిలో ఉన్నారు. దేశానికి మనం చెయాల్సిన పని చాలా ఉంది. మనకి ఇబ్బందులు ఉన్నాయి. సిబ్బంది కూడా ఉన్నారు. అందుకని మనం పకడ్బందీగా మన ధర్మాన్ని పట్టుకోవాలి. దానికి ఏం చేయాలో ఆలోచించాలి. ధర్మం, భక్తి, సదాచారం అనేది ఒక గొప్ప Value. Market Value మనం ఎలా చూస్తామో అలాగే మనిషి యొక్క value కూడా మనం పెంచాలి. అది ధర్మం వలనే సాధ్యము. కాబట్టి ధర్మాన్ని ఏదో ఒక మూఢనమ్మకంగా కాకుండా వైజ్ఞానిక దృష్టితో చూడాలి. ధర్మంలో వికాసం, మనస్సుకు ఆహ్లాదం ఉంటుంది. దాన్ని మనం సరైన పద్ధతిలో అర్థం చేసుకుని ఆచరించాలి. ప్రచారం వలన మాత్రమే విస్తరించిన ధర్మం కాదు మనది. ఋషుల మౌనంతో, ఉపవాసంతో, సదాచారంతో, సంచారంతో పెరిగింది. అందుకని మన యువత కూడా మూలానక్షత్రం రోజున పదినిమిషాలు మౌనం పాటిస్తూ, రామనామం రాస్తూ, భక్తితో ఉండాలి. అలాగే తల్లిదండ్రుల అనుమతితో కుటుంబబాధ్యతలు అంటే వివాహాది కార్యములు మంచిగా నిర్వహించి, వాళ్ళు కూడా పిల్లలను మంచిగా పెంచాలి. ఇదే భారతదేశ భవిష్యత్తుకు యువత చేసే దేశసేవ, ధర్మసేవ. ఇప్పుడు అవకాశాలు ఉన్నాయి. అధికారాలు వస్తాయి. వీటితో పాటు బాధ్యతలని కూడా యువత స్వీకరించాలి. ఈ విషయంలో తోడుగా పెద్దవయస్సువారు ఉన్నారనేది మంచి సంకేతం. పెద్దవయస్సువాళ్ళకి వాళ్ళతరంలో తల్లిదండ్రులు ఇప్పుడు మీకున్నంత అధికారము, స్వాతంత్ర్యము ఇచ్చారో లేదో తెలీదు. కానీ ఈరోజుల్లో తల్లిదండ్రులు అమ్మాయిలకు గాని, అబ్బాయిలకుగాని స్వాతంత్ర్యము, ప్రోత్సాహము ఇస్తున్నారు. తల్లిదండ్రుల మనస్సుకు ఇబ్బంది కలిగించకుండా ధర్మం, సంస్కృతి, కుటుంబసభ్యతతో వాళ్ళని గౌరవిస్తూ, విజ్ఞానంలో ఆధునికంగా, ఆలోచన, సంస్కృతిలో ప్రాచీనంగా ఉండి, ప్రాచీనధర్మం, నవీన విజ్ఞానంతో యువత అన్నింటినీ సమగ్రంగా ఆలోచించి ఈ దేశానికి, ధర్మానికి, సమాజానికి సహకరించి ఉన్నతి సాధించాలి. వివేకానంద స్వామి గురించి మీరు చెప్పారు యువజన దినోత్సవం జనవరి 12తారీకు అని. మానవ జీవితంలో నీరక్షీర వివేకం చాలా అవసరం. అలా ఏది మనం పట్టుకోవాలో, ఏది మనం పట్టించుకోకూడదో అనే విషయంలో స్పష్టత కలిగి ఉండాలి.

వివేకం చేతనే ఆనందం వస్తుంది. వివేకచూడామణిలో 'సర్వవేదాంత సిద్ధాంత గోచరం తం అగోచరం గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మి' అని ఆదిశంకరులు చెప్పారు. అలా సర్వవేదాంత సిద్ధాంత గోచరం ఈ దేశం. వేదాంతభూమి ఇది. ఆ వేదాంతం అనేది మనకు ఇహపర శ్రేయస్సును, శాంతి భద్రతలను కలిగిస్తుంది. ఆంధ్రదేశ యువత ధర్మము, సంస్కృతి, భక్తిమార్గాలలో ఉండి, విజ్ఞానము రూపకల్పనలో నూతనంగా ఉండి, సంస్కృతిలో మాత్రం ప్రాచీనంగా ఉండాలి.

"శ్రేయో భూయాత్ సకల జనానాం" అని కంచి పరమాచార్యులవారు ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిగారిచే U.N.Oకి సందేశం పంపారు. మీరు Global అన్నారు కదా అందుకని ఈ ప్రస్తావన. మంచి మధురమైనవాణితో మనస్వామివారి ఆశీర్వచనంతో మంచి సందేశాన్ని ఆవిడ U.N.Oకు వెళ్ళి పాడారు. మనం లోకగురు అవడానికి ముందు లోకల్ గురు అవ్వాలి. అప్పుడే మనం లోకగురు అవుతాము. దీనికోసం మన కుటుంబాన్ని, గ్రామాన్ని, ప్రదేశాన్ని, దేశాన్ని గౌరవిస్తూ మంచిగా ఉండటానికి కంచికామాక్షి అమ్మవారిని ప్రార్థిస్తున్నాం.

**జయజయ శంకర హరహర శంకర**



శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం మొదటి అధ్యాయం ఈ నెల సంపుటిలో...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

శ్రీ శంకర భగవత్పాదాచార్యుల వారు సూక్ష్మ తత్త్వవిచారకుడిగా, విలక్షణమైన తార్కికుడిగా, నిష్ణాతులైన రచయితగా, శ్లాఘనీయమైన కవిగా, కొనియాడదగిన వ్యాఖ్యాతగా, ప్రపంచానికే గురువుగా నిలుస్తారు. భారతదేశంలో ప్రతి ఇంట్లో ఆచార్యుని పేరు మారుమోగుతుంది. తత్త్వవేత్తగా ఆయన పేరు, ఘనత సముద్రాల ఆవలకు విస్తరించింది. బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులపై శంకరాచార్యుని భాష్యాలు (వ్యాఖ్యానాలు), ఆయన ఇతర రచనలు ఈ భూమిపై వైదిక ధర్మాన్ని విశ్వసించి, ఆచరించే ప్రజలందరూ అందిపుచ్చుకున్న సుసంపన్న వారసత్వం. ఆచార్యులు దేశంలో భిన్న ప్రదేశాలలో స్థాపించిన వ్యవస్థలు ఆయన జ్ఞాపకాలకు సజీవ చిహ్నాలుగా నిలుస్తాయి.

మన దేశంలో అనేక ప్రాంతాలలోని ప్రతి పుణ్యక్షేత్రం లేదా ప్రదేశం శంకరుని జీవిత చరిత్రలోని ఏదో ఒక ఘటనతో ముడిపడి ఉంది. భారతదేశంలో దక్షిణ మోక్షపురిగా ప్రసిద్ధి చెందిన కాంచీపురం కూడా అనేక విధాలుగా శ్రీశంకరాచార్యులతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంది.

శంకరుని జీవిత చరిత్రను బహు భాషలలో, భిన్న రూపాలలో వివిధ యుగాలలో, కాలాలలో చేసిన రచనలన్నీ కూడా శంకరాచార్యులకు పవిత్ర నగరమైన కాంచీపురంతో ఉన్న అనుబంధానికి సంబంధించిన సమాచారాన్ని కలిగి ఉంటాయి.

అటువంటి రచనలలో ప్రస్తావించిన ఈ అనుబంధాలను అందరికీ అందచేయడమే కాక, కాంచి, చుట్టుపక్కల ప్రాంతాలలో కనిపించే శంకరాచార్యుల విగ్రహాల చిత్రాలను కూడా ఇందులో పొందుపరిచే ప్రయత్నం కూడా జరిగింది. ఈ రచనను ప్రచురించేందుకు ముంబైకి చెందిన శ్రీ మహాలక్ష్మి ఆలయ ధర్మనిధి అందించిన ఆర్థిక సహాయానికి మా కృతజ్ఞతలు

## అధ్యాయం -1

# శ్రీశంకర దిగ్విజయ యాత్ర



శ్రీలలితా సహస్రనామము ప్రముఖ వ్యాఖ్యాత అయిన భాస్కరాచార్యులు తన ముందు మాటలో ప్రస్తావించిన ప్రాచీన సాహిత్యమైన విష్ణుధర్మోత్తరలోని రుగ్వేద మంత్రమైన ధేనంపహ్వాయామి సిధుఘం అన్న మంత్రానికి తన పద్యంలో వివరణను ఇస్తూ శ్రీశంకర భగవత్పాదుల వారికి నివాళులు అర్పించారు. పుష్కరుడనే గొప్ప యక్షుడు శ్రీరామునికి బోధించిన బోధల పౌరాణిక గ్రంథం ఈ రచన. భాస్కరాచార్యుని పద్యం ఇలా సాగుతుంది.

**శ్లో॥ శ్రీ రామం ప్రతి పుష్కరాభిధమహాయక్షేణ వేదత్రయ-**
**వ్యాఖ్యానావసరే విశిష్య కథితం శ్రీ విష్ణుధర్మోత్తరే ।**
**ఏతాం ధేనుముపాహ్వయామి సుదుధామిత్యృగ్గతం శంకరాచార్యం**
**శిష్య చతుష్టయేన సహితం వందే గురూణాం గురుమ్ ॥**

పై పద్యంలో, పుష్కరుడనే యక్షుడు మూడు వేదాలలోని అంశాలను, ముఖ్యంగా విష్ణుధర్మోత్తరలో వివరించిన రుగ్ (మంత్ర) ఏతం శంకరాచార్యను వివరిస్తూ గురువులకే గురువు అయిన శంకరాచార్యులకు తన నలుగురు శిష్యులతో కలిసి నమస్కరిస్తున్నాను అని శ్రీరామునితో అన్నారు.

శివుడు, సూర్యుడు తదితరుల అవతారంగా పురాణ, ఇతర ప్రాచీన గ్రంథాలలో శంకరాచార్యుల ప్రస్తావనలు కనిపిస్తాయి. అయితే, శంకరుల తొలి ప్రస్తావనలు క్రీ.శ.9లో కంబోడియా రాజు (లేదా ఆయన పేరు కలిగిన వారసుల) శాసనంలో విదేశీయులు కనుగొన్నారు. కంబోడియా రాజు తన శాసనంలో సర్వజ్ఞుడైన వ్యక్తి ఆధ్వర్యంలో శాస్త్రాలను అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. శాసనంలో పద్యం ఇలా సాగుతుంది -

**శ్లో॥ యేనాధీతాని శాస్త్రాణి భగవచ్ఛంకరాహ్వయాత్ ।**
**నిఃశ్శేషసూరిమూర్ధాలిమాలాలీఢాంఘ్రిపంకజాత్ ॥**

శ్రీశంకరులు కేరళలోని తిరుచివప్పెరూర్ (ఆధునిక తిరుచూర్)లో శివగురు, ఆర్యాంబలకు జన్మించారు. పుట్టిన సంవత్సరాలకే తండ్రిని కోల్పోయారు. బ్రహ్మచర్య దీక్ష తీసుకున్న తర్వాత శంకరులు వేదాధ్యయనాన్ని చేపట్టారు. చిన్న వయస్కుడైనప్పటికీ ఆ బాలుడు మహామేధావి లక్షణాలను కనపరచారు. ఒకరోజు, దగ్గరలో ఉన్న నదిలో స్నానం చేస్తుండగా, మొసలి ఒకటి అతడి కాలును పట్టుకొని, నదిలోకి లోతుగా లాగడం మొదలుపెట్టింది.

ఆపద నుంచి తప్పించుకునేందుకు ఏకైక మార్గం సన్యాసి కావడమే అని తెలుసుకున్న శంకరులు వెంటనే తగిన మంత్రాలను ఉచ్ఛరించారు. క్లుప్తంగా చెప్పాలంటే, సన్యాసాశ్రమంలోకి ప్రవేశించడానికి అవసరమైన కర్మలను ఆచరించారు. దానితో మొసలి కూడా అతడి పాదాన్ని వదిలిపెట్టింది. యువ సన్యాసి బలమైన సంకల్పాన్ని వృద్ధురాలైన తల్లి అయిష్టంగానైనప్పటికీ ఆమోదించింది. తన ఏకైక కుమారుడు ఎలాగైనా సజీవంగా ఉండాలని కోరుకుంది.

రామభద్ర దీక్షితులు రాసిన పతంజలి చరిత్రలో శంకరాచార్యుల జీవితగాథను సంగ్రహంగా రేఖామాత్రంగా అందించారు. ఆ పండితుడు, తన రచనలోని ఎనిమిదవ అశ్వాసము లేదా కాండలో, మొసలి శంకరుల పాదాన్ని పట్టుకున్న ఘటన నుంచి కథను ప్రారంభించారు.

**శ్లో॥ అత్రాన్తరే సరితి నక్ర గృహీతపాదః ।**
**సన్యస్య శంకరమునిర్దురితాద్విముక్తః ॥**

నదిలో మొసలి తనను పట్టుకోవడంతో, జ్ఞాని అయిన శంకరులు సన్యాసాన్ని స్వీకరించి, మొసలి బారి నుంచి త్వరగా

తప్పించుకున్నారని శ్లోకం చెప్తుంది. తర్వాత తన తల్లి బాగోగులు, సంరక్షణకు తగిన ఏర్పాటు చేసి, ఆమె అనుమతితో శంకరులు కాలడి వదిలిపెట్టారు. మంచి గురువు ఆధ్వర్యంలో మంత్రపూర్వకంగా, విధివిధానాలతో సన్యాసాశ్రమ దీక్షను పొందాలని ఆయన ఉత్తరం వైపుగా నడక సాగించారు. కొంత కాలానికి ఆయన నర్మదా నది ఒడ్డుకు చేరుకున్నారు. బాల సన్యాసికి నర్మదా నది ఒడ్డున ఒక చిన్న గుహలో నివసిస్తున్న గోవింద భగవత్పాదులు సన్యాస దీక్షను ఇచ్చినట్టు సాహితీ ఆధారాలు చెప్తున్నాయి. గోవింద భగవత్పాదులు రచించారని ఆయనకు ఆపాదితం చేసిన శంకర విజయంలో భగవత్పాదులవారే శంకరులకు దీక్షను ఇచ్చి అన్ని మహావాక్యాలను, కావ్యాలను బోధించారుట. దానికి సంబంధించిన శ్లోకం ఈ విధంగా ఉంది.

**శ్లో॥ భక్తిపూర్వకృతతత్పరిచర్యాతోషితో అధికతరం యతివర్యః।**
**బ్రహ్మతాముపదిదేశ చతుర్భిర్వేదశేఖరవచోభిరముష్మై ॥**

చిద్విలాసుడు రచించిన శంకరాచార్య జీవిత చరిత్రలో కూడా గోవింద భగవత్పాదులే శంకరులకు సన్యాస దీక్షను ఇచ్చి, మహాకావ్యాల అధ్యయనం చేయించారని పేర్కొంటుంది. కనుక –

**శ్లో॥ మహావాక్యాని దివ్యాని తత్త్వమస్యాదికాన్యపి,**
**ముముక్షుభిః సదా ధ్యేయం రహస్యం యదృస్తి తత్ ।**
**ఉపాదిశదతః సర్వం వేదాంతార్థ వినిశ్చితం,**
**సన్యాసిభిః విధేయాన్ తు విశ్వేశః స్మృతిచోదితాన్ ॥**

శంకరుల వారి జీవిత గాథను క్లుప్తంగా వివరించే పలు ఆత్మకథలు, ఇతర రచనలు ఏకరీతిగా లేవు. అయినప్పటికీ, నాస్తిక మత శాఖలను ఖండించడం, వైదిక ధర్మాన్ని పరిరక్షించడం బలమైన వైదిక పునాదితో షణ్మతమార్గాన్ని స్థాపించడం, అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేయడం కోసం శంకరులు కాలినడకన సుదీర్ఘంగా, విస్తృతంగా దేశం నలుమూలల (బహుశ రెండుసార్లు) పర్యటించిన విషయాన్ని ఈ రచనలన్నీ సూచిస్తున్నాయి. దేశంలోని అనేక పవిత్ర స్థలాలు, పుణ్యక్షేత్రాలు ఆదిశంకరుల పేరుతో ఏదో ఒక రకమైన అనుభంధాన్ని కలిగి లేదా మరేదైనా సంబంధాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకోవడంలో ఆశ్చర్యం లేదు.

ఆదిశంకరులు తన దిగ్విజయ యాత్రలో భాగంగా భారత దేశంలో నాలుగు దిక్కులకు వెళ్ళినట్టు – పశ్చిమంలో ద్వారక, ఉత్తరంలో బద్రీనాథ్, తూర్పున జగన్నాథ్ పూరి, దక్షిణంలో రామేశ్వ రాన్ని దర్శించినట్టు శంకరుని జీవితకథను చిత్రించే ఆత్మకథలు, ఇతర రచనలు ఏకరీతిగా పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, ప్రజాదరణ పొందిన శంకరుని మూడు ఆత్మకథలైన శంకర విజయం, (నవ కాళిదాస) చిద్విలాసుడు రచించిన జీవిత చరిత్ర, ఆనందగిరి రచన అన్నీ కూడా పవిత్రమైన ఏడు మోక్షపురిలలో నాలుగింటిని – కాశ్మీర్, కాంచి, ఉజ్జయిని, ద్వారకలను కూడా సందర్శించినట్టు అంగీకరిస్తున్నాయి. అయోధ్య, మాయ (హరిద్వార్), మధురల సందర్శనను మినహాయించలేదు.



# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విశాఖపట్టణ విజయయాత్రా విశేషాలు

జనవరి12 2023, జగద్గురువుల ఆధ్వర్యంలో ఏకకాలంలో అనేక కార్యక్రమాల నిర్వహణతో విశాఖపట్నంలోని శంకర మంఠం కళకళలాడుతోంది. స్వామివారి ఆదేశాలను అనుసరించి లోకక్షేమం కోసం చండీ హోమం, ధన్వంతరి హోమం వంటి వివిధ హోమాలను నిర్వహిస్తున్నారు. వీటితో పాటుగా శ్రీ చిర్రావూరి శ్రీరామశర్మగారు, శ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్య సలక్షణఘనపాఠిగార్ల ఆధ్వర్యంలో వ్యాకర్త సభ జరిగింది. శ్రీ కుప్పా విశ్వనాథ శాస్త్రిగారి ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శ్రీ కంచి పరమాచార్యులు సిద్ధి పొందిన కేలెండర్ తేదీ అయిన జనవరి 8న ఆయనను సంస్మరించుకునేందుకు వైదిక సదస్సును నిర్వహించారు. సుక్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించిన స్వయంవర పార్వతి హోమం సందర్భంగా స్వామివారు తన ఆశీర్వచనాలను అందించారు.

కంచి విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులు తమ విద్యను కొనసాగించేందుకు సహాయాన్ని అందించేందుకు స్టూడెంట్స్ స్కాలర్‌షిప్ మద్దతు పథకంపై ఎస్‌పిసిటితో ఎన్ఎస్‌డిఎల్ ఒప్పందంపై సంతకాలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్‌డిఎల్ అధికారులను స్వామివారు ఆశీర్వదించారు.

వేద శాస్త్ర సంరక్షణం ఏ ఉత్కళ పేరుతో పని చేస్తున్న ఒడిషా భక్తులను ఉద్దేశించి జగద్గురువులు ప్రసంగించారు.



ప్రముఖ సంగీత కళాకారులైన మల్లాది బ్రదర్స్ సహా పలువురు స్వామివారి సమక్షంలో తమ కళను ప్రదర్శించారు.

శ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్య సలక్షణ ఘనాపాటిగారి మార్గదర్శనంలో వేద సప్తాహం జరుగుతోంది.

ఇవి మాత్రమే కాకుండా, ఆదివారం ఉదయం సూర్య నమస్కారాలు, మంగళవారం సాయంత్రాలు సువాసినులు చేసే దీప పూజ వంటి నిత్య కార్యకలాపాలు యధావిధిగా సాగుతున్నాయి. విశాఖపట్నం, దాని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులకు ధనుర్మాస విశేష చంద్రమౌళీశ్వర పూజను చూసి, జగద్గురువుల చేతుల మీదగా ప్రసాదాన్ని అందుకునే భాగ్యం కలిగింది.

మధ్యాహ్నం త్రికాల చంద్రమౌళీశ్వర పూజ అనంతరం, విశాఖపట్నంలోని శ్రీమఠం శిబిరం నుంచి చెన్నైలోని మైలాపూర్‌లో విరూపాక్షేశ్వర ఆలయానికి ఒక అందమైన నాగాభరణాన్ని స్వామివారు ఆశీర్వదించారు. ఈ 12 కిలోల బరువైన వెండి నాగాభరణాన్ని శ్రీమఠం భక్తుడు ఒకరు ఆలయానికి సమర్పించారు. వైదిక మంత్రాల నడుమ స్వామివారు నాగాభరణానికి చందనం, కుంకుమను, పూలను, నైవేద్యాన్ని సమర్పించి, హారతిచ్చారు. జగద్గురువుల ఆశీస్సులతో నాగాభరణాన్ని ప్రస్తుతం చెన్నైలోని ఆలయానికి తీసుకువెడుతున్నారు.

జనవరి15 2023, సంప్రదాయబద్ధమైన రీతిలో భోగి పండుగ జరుపుకోవడంతో మకర సంక్రాంతి సంబరాలు విశాఖపట్నంలోని శంకరమఠంలో శ్రీమఠం శిబిరంలో ముందురోజు సాయంత్రం ప్రారంభమయ్యాయి.

శిబిర ప్రాంగణాన్ని సంప్రదాయ తోరణాలు, ముగ్గులు, వాటి మధ్య గొబ్బెమ్మలు, భగవన్నామ సంకీర్తన చేస్తూ తిరిగే హరిదాసుతో, సంప్రదాయ పాటలకు మహిళ కోలాట ప్రదర్శనతో కోలాహలంగా మారింది.

ఉదయం జగద్గురువుల విశ్వరూప దర్శనం అనంతరం, భక్తులు శ్రీ చంద్రమౌళీశ్వర పూజను దర్శించుకున్నారు. పీఠం సంప్రదాయానికి అనుగుణంగా, మకర సంక్రాంతి రోజున సూర్య నమస్కారాలతో పాటు, సూర్యనారాయణ స్వామి పూజ జరిగింది. ఆచార్యులు చంద్రమౌళీశ్వర పూజను పూర్తి చేసిన అనంతరం వచ్చి సూర్యనారాయణ పూజ పూర్తైందన్నందుకు సంకేతంగా మంగళ హారతి సమర్పించారు. జగద్గురువులు నవగ్రహాల చుట్టూ ప్రదిక్షణ చేయడమే కాక అక్కడకు వచ్చిన భక్తులను సూర్యనారాయణ స్వామి, నవగ్రహ శ్లోకాలను పఠించవలసిందిగా సూచించారు.

జనవరి 16న మకర సంక్రాంతి పొంగల్ వేడుకలు – కనుమ / మాటు పొంగల్‌ను విశాఖపట్నంలోని శంకర మఠం పక్కన గల గోశాలలో సాయంత్రం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేసిన అనుగ్రహ భాషణంలో ఆచార్యులు గోమాతను ఆరాధించడం ద్వారా వేడుకను జరుపుకోవడమే కాకుండా, తల్లిదండ్రులకు, వృద్ధులకు, మన చేత ఓనమాలు దిద్దించిన గురువులు మొదలుకుని అందరికీ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలుపుతూ జరుపుకోవల్సిన ప్రాముఖ్యతను వివరించారు. భక్తులు లక్ష్మీ అష్టోత్తరాన్ని చదువుతుండగా, జగద్గురువులు గోపూజ చేశారు. అనంతరం, మఠ సంప్రదాయం ప్రకారం కనుమ/ మాటు పొంగల్ కర్మకాండలను నిర్వహించి, ఆవులకు పొంగల్ తినిపించారు. వాతావరణం అంతా సంప్రదాయ కోలాహలమైన పొంగలో పొంగల్ అన్న కేకలతో (పచ్చ పొంగలి, పాల పొంగలి, పొంగలో పొంగలి) ప్రతిధ్వనించింది. ఏడాది పొడవునా గోవుల సంరక్షణకు కృషి చేస్తున్న శ్రీమఠం కార్యకర్తలను ఆయన స్వయంగా సత్కరించారు.


జనవరి17 2023, ఈరోజు శ్రీ కంచి పరమాచార్యుల వారి శుభకరమైన జన్మనక్షత్రం అనుషం (అనురాధ). నేటి ఉదయం విశాఖపట్నంలోని శంకరమఠంలో శ్రీమఠం శిబిరంలో లోక క్షేమం కోసం అవహంతి హోమాన్ని నిర్వహించారు. జగద్గురువులు వచ్చిన భక్తులకు దర్శనమిస్తూనే హోమ పూర్ణాహుతి వరకూ కూర్చున్నారు.

జనవరి21 2023, శనివారమైన నేటి సాయంత్రం జగద్గురువులు ధర్మాదాయ శాఖ సభ్యులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేసి, వారికి ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.



జనవరి22 2023, నేడు మాఘ మాస ఆదివారం – పవిత్ర మాఘ మాసంలోని మొదటి ఆదివారం (చాంద్రమానం ప్రకారం) సూర్య నమస్కారాలు, అనంతరం సహస్ర గాయత్రి జపంతో పాటుగా 24మంది దంపతులు శ్రీ గాయత్రి సహస్రనామార్చన చేయడంతో శుభప్రదంగా ప్రారంభమైంది. విశాఖపట్నంలోని శంకరమఠంలో

శ్రీమఠం శిబిరం ఆదివారం నాడు 140 మంది వేద పండితులు వేదోచ్ఛరణలతో ప్రతిధ్వనించింది. ఈ చతుర్వేద పారాయణలో విశాఖపట్నం, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేద పండితులు రిగ్, యజుర్, సామ, అధర్వణ వేద పారాయణ చేశారు. ఆచార్యులు నిర్దేశించినట్టుగా, వేదపారాయణం తర్వాత విశాఖ అనే పదానికి చాలా అందమైన వర్ణ క్రమం జరిగింది. చంద్రమౌళీశ్వర పూజ అనంతరం వేద పండితులను, భక్తులను తీర్థ ప్రసాదాలతో జగద్గురువులు ఆశీర్వదించారు. సాయంత్రం వేద పండిత సభను ఉద్దేశించి ఆచార్యులు అనుగ్రహ భాషణం చేసి ప్రసాదంతో ఆశీర్వదించారు.



జనవరి23 2023, సోమవారం త్రికాల పూజను మధ్యాహ్నానికి పూర్తి చేసిన తర్వాత స్వామివారు విశాఖపట్నంలోని లలితా పీఠానికి వెళ్ళారు. శ్రీ లలితా పీఠం అధిపతి పూజ్యశ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామీజీ సహస్ర చంద్ర దర్శన వేడుకల కోసం అక్కడకు వెళ్ళారు. స్వామివారు తన అనుగ్రహ భాషణంతో భక్తులను ఆశీర్వదించారు. తర్వాత జగద్గురువులకు, శ్రీలలితా పీఠం పూజ్యశ్రీ స్వామీజీకి పూష్ప యాగం జరిగింది.

జనవరి25 2023, నేటి సాయంత్రం గిరిజన సమాజానికి చెందిన భక్తుల బృందం స్వామివారి సమక్షానికి వచ్చి, ధర్మసంరక్షణం అన్న కరపత్రికను ఆయన పవిత్ర హస్తాల మీదుగా విడుదల చేయించారు. స్వామివారు బృందాన్ని అనుగ్రహ భాషణంతో, ప్రసాదాలతో ఆశీర్వచనాలను అందించారు.



జనవరి 26, 2023 వసంత పంచమి పర్వదిన ఉత్సావాలు విశాఖపట్నం, శంకర మఠంలోని శ్రీమఠం శిబిరంలో సరస్వతీ పూజ, పిల్లలకు అక్షరాభ్యాసాలతో ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే జగద్గురువుల ఆశీర్వచనాన్ని పొందేందుకు అనేకమంది చిన్నపిల్లలు వచ్చారు. మొదటి, రెండు కాలా చంద్రమౌళీశ్వర పూజను పూర్తి చేసిన అనంతరం స్వామివారు సరస్వతి పూజా సన్నిధిలో మంగళ హారతి ఇచ్చి, పిల్లలకు ప్రసాదంగా పంచే పుస్తకాలను, పెన్నులను ఆశీర్వదించారు.

అనంతరం స్వామివారు భీమ్లీ/ భీమునిపట్నంలోని శ్రీ అద్యాది శ్రీ మహలక్ష్మి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేకాన్ని సందర్శించి, ఆశీర్వదించేందుకు బయలుదేరి వెళ్ళారు. ఈ ఆలయం భీమ్లీలో సద్గురు పూజ్యశ్రీ శివానంద మూర్తి ఆశ్రమ ఆవరణలో ఉంది. కుంభాభిషేకం పూర్తి అయిన తర్వాత స్వామివారు భక్తులకు ఇచ్చిన అనుగ్రహభాషణంలో అనేక సందర్భాలలో శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు, సద్గురు శివానంద స్వామీజీతో తన సంభాషణలను గుర్తు చేసుకున్నారు. 2008లో ఆలయాన్ని నిర్మించినప్పుడు విజయదశమి అయిన 9 అక్టోబర్ నాడు శ్రీ జయేంద్ర సరస్వతీస్వామివారు ఈ ఆలయంలో కుంభాభిషేకాన్ని ఆశీర్వదించేందుకు కాంచీపురం నుంచి భీమ్లీకి తరలివచ్చారు. మళ్ళీ





నేడు పర్వదినమైన వసంత పంచమి రోజున జీర్ణోద్ధరణ/ కుంభాభిషేకం స్వామివారి సమక్షంలో జరిగింది. భీమ్లీలోని మహాలక్ష్మి ఆలయం నుంచి తిరిగివచ్చిన స్వామి వారు సాయంత్రం విశాఖపట్నంలోని కనక మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. కనక మహాలక్ష్మి ఆలయంలో కనక ధార పేరుతో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 300మంది ఆడపిల్లలు కనకధారా స్తోత్రాన్ని, మహాలక్ష్మి అష్టోత్తరాన్ని, నిత్య పారాయణ శ్లోకాలను స్వామివారి సమక్షంలో పఠించారు. కనక మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో జగద్గురువులు హారతి దర్శనంతో పర్వదినం ముగిసింది.

జనవరి28 2023, రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్ లో ఉదయం సూర్య నమస్కారాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగద్గురువుల సమక్షంలో భక్తులు రథ సప్తమి స్నాన సంకల్ప శ్లోకాలను పఠించడమే కాక, రథ సప్తమి స్నాన ద్రవ్యాల ప్రాముఖ్యతను, సంకల్ప శ్లోకాల అర్థాలను పండితులు ఇచ్చిన వివరణలను తెలుసుకున్నారు. అనుగ్రహ భాషణం అనంతరం, స్వామి సూర్యనారాయణ స్వామి శ్లోకాలను స్వయంగా పఠించడమే కాక, తాను ఉచ్చరిస్తున్న శ్లోకాలను తిరిగి భక్తులు ఉచ్చరించే అవకాశాన్ని భక్తులకు ఇచ్చి అనుగ్రహించారు. ఈ కార్యక్రమం అనంతరం సముద్రానికి పూలు, ఇతర ద్రవ్యాలతో ఆరాధించేందుకు స్వామివారు ముందుకు సాగారు. పూజానంతరం శిబిరానికి బయలుదేరే ముందు అక్కడకు వచ్చిన భక్తులను ఆశీర్వదించారు.

**జయ జయ శంకర హర హర శంకర**



**విశాఖపట్టణంలో స్వామివారి సమక్షంలో వైద్యుల సమావేశం**



**విశాఖపట్టణంలో స్వామివారి సమక్షంలో న్యాయవాదుల సమావేశం**



అయోధ్య రామమందిర కోశాధికారి శ్రీ గోవింద గిరి మహరాజ్‌గారు స్వామివారిని దర్శించుకున్నారు.



విశాఖ శారదాపీఠ ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి, స్వామివారిని దర్శించిన సందర్భం



మిజోరాం గవర్నర్ హరిబాబుగారు స్వామివారిని దర్శించుకున్న సందర్భం.



హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయగారు స్వామివారిని దర్శించుకున్న సందర్భం.



విశాఖపట్నంలోని సంపత్ వినాయక గుడిని స్వామివారు దర్శించుకున్నారు.



స్వామివారి సమక్షంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ సభ్యుల సమావేశం



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

**ఆదృతకాంచీనిలయామాద్యామారూఢయౌవనాటోపామ్ ॥**
**ఆగమవతంసకలికామానందాద్వైతకందళీం వన్దే ॥ 9 ॥**

**తాత్పర్యం:–** కాంచీనగరనిలయమునందు ఆదరము కలిగినది, ఆద్యురాలైన,యౌవనమనే గర్వమునెక్కినది, వేదములు తమశిరోభూషణములయందు ధరించిన మొగ్గయు, ఆనందమనే అద్వైతవృక్షమునకు మొలకయైన ఆ తల్లికి నమస్కరిస్తున్నాను.

**బాలమనోజ్ఞ:–** ఆ తల్లి ఈశ్వరుని కొరకై తీవ్రమైన తపస్సు చేసిన ప్రదేశము కాంచీనగరము. అందుకే ఆ తల్లికి కాంచీనగరంలో నివసించటమంటే అధిక ప్రీతి. అన్నిటికంటే మొదటిది అన్నింటికీ మూలము ఆమే. "మూలప్రకృతిరవ్యక్తా వ్యక్తా–వ్యక్తస్వరూపిణీ" అని లలితాసహస్రనామం. అలాగని ఆవిడ ప్రౌఢకాదు. లేతప్రాయపు యవ్వనమున ఉన్నది. ఆ యవ్వనము అందరి యవ్వనాలనూ ధిక్కరించి దర్పముతో ఉన్నది. అట్టి యవ్వనగర్వము కలిగిన ఆ తల్లిని వేదములు తమశిరోభూషణములయందు అలంకారమగు మొగ్గలా ధరించాయట. పువ్వునకు వాడిపోయే స్వభావముంటుంది. కానీ మొగ్గ అనే పదాన్ని చెప్పారంటే ఆ తల్లి నిత్యయవ్వనముగా ఉన్నదనీ, అటువంటి తల్లికి వేదములు తమ శిరస్సులను వంచి నమస్కరిస్తున్నాయనీ ఇక్కడి భావము. వేదముల శిరస్సులు అంటే ఉపనిషత్తులనీ ఆ శిరస్సులకు ఈ తల్లి అలంకారమనీ కూడా చెప్పవచ్చు. ఆనందమంటే కేవలం మానుషానందము కాదు. మానుషానందమునుండి బ్రహ్మానందం దాకా ఏ ఆనందముందో అదే అసలైన ఆనందం. ఆ ఆనందాన్ని పొందాలంటే అద్వైతభావన రావాలి. శివశక్తులకు అభేదమనే సగుణం నుండి సోహమనే నిర్గుణాన్ని పొందితేనే ఆ ఆనందం ప్రాప్తిస్తుంది. ఆ ఆనందవృక్షాన్ని మొలకెత్తించాలంటే అమ్మవారే శరణ్యం. "చిత్కళానందకలికా" అని లలితాసహస్రనామం. అటువంటి ఆ తల్లికి నమస్కరిస్తున్నాను.

**తుంగాభిరామకుచభరశృంగారితమాశ్రయామి కాంచిగతమ్ ॥**
**గంగాధరపరతంత్రంశృంగారాద్వైతతంత్రసిద్ధాంతమ్ ॥ 10 ॥**

**తాత్పర్యం:–** ఎత్తైన వక్షోజములబరువుచే అలంకరించుకున్న శివునికి విధేయమైన కాంచీపురమునందున్న శృంగారాద్వైతతంత్ర సిద్ధాంతమును ఆశ్రయించెదను.

**బాలమనోజ్ఞ:–**నవప్రసూతి యైన తల్లి తన శిశువు ఆకలి తీర్చటానికి తన స్తన్యాన్ని అందిస్తుంది. ఆ స్తనములు ఎప్పుడూ పాలతో నిండుకున్న కారణంగా ఉన్నతంగా ఉంటాయి. ఇక్కడ ప్రపంచమునకే తల్లియైన కామాక్షిని ఎత్తైన వక్షోజములచే సింగారించుకునినదని అందుకు వర్ణించారు. సామాన్యంగా అమ్మ తన శిశువు యొక్క కడుపు నింపటానికే తన పాలను ఇస్తుంది. కానీ ఈ తల్లి జన్మజన్మలకూ తరగని జ్ఞానాన్ని అందిస్తుంది. అందుకే సౌందర్యలహరి లో శంకరులు "తవ స్తన్యం మన్యే ధరణిధరకన్యే హృదయతః...." అంటూ ఆ స్తన్యపానప్రభావం వలన ప్రౌఢమైన కవిత్వాన్ని పొందలిగానని చెప్తారు. ఆవిడ అందము, పరాక్రమము ఇవి మాత్రమే ఏమిటి? ఆవిడే శివునికి విధేయమైనదట. అంటే శివునికంటే అభిన్నమైనది. "శివదూతీ శివారాధ్యా శివమూర్తిశ్శివంకరీ" అని లలితా సహస్రనామ స్తోత్రము. శివుడు లేనిదే శక్తి లేదు. శక్తికి ఆశ్రయమైనది శివుడు. శివశక్తుల కలయికే అద్వైతము. "జగతఃపితరౌ వన్దే పార్వతీపరమేశ్వరౌ" అని కాళిదాసు శివశక్తులు శబ్దార్థముల వలె విడదీయరాని సంబంధము కలిగినవని చెప్పటం జరిగింది. అదియే కాదివిద్య. అటువంటి అద్వైతసిద్ధాంతమునకు మూర్తి యైన ఆ తల్లిని ఆశ్రయించెదను. మాతా చ పితా చ పితరౌ " అని.



శ్రీ

శ్రీ కామాక్షీ దేవ్యై నమః





# శ్రీ కంచికామకోటిపీఠం శ్రీమఠసంస్థానం
# శ్రీ కామాక్షీ అమ్మవారి దేవస్థానం

**శ్రీ ఆది శంకర భగవత్పాద పరంపరాగతమూలామ్నాయ సర్వజ్ఞ పీఠ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు**
**జగద్గురు శ్రీ శంకరాచార్య స్వాముల వారు పరంపరాధీన ధర్మ కర్తలు**

శుభకృద్వర్షీయ

## బ్రహ్మోత్సవపత్రిక

| | | |
|---|---|---|
| సుధామప్యాస్వాద్య ప్రతిభయజరామృత్యుహరిణీం<br>విపద్యంతే విశ్వేవిధిశతమఖాద్యా దివిషదః<br>కరాళంయత్క్ష్వేలం కబలితవతః కాలకలనా<br>న శంభోస్తన్మూలం తవ జనని తాటంక మహిమా<br>శ్రీ ఆది శంకరాచార్యులు | త్ర్యంబక కుటుంబినీం త్రిపురసున్దరీమిన్దిరాం పులిందపతిసుందరీం త్రిపురభైరవీం భారతీం।<br>మతంగకులనాయికాం మహిషమర్దనీం నాయికాం భణంతి విబుధోత్తమాః విహతిమేవ కామాక్షి ॥<br>శ్రీ మూక శంకరులు | విశ్వకారణనేత్రాఢ్యాం మహాత్రిపురసున్దరీం<br>బంధకాసుర సంహర్త్రీం కామాక్షీం తామహం భజే<br>శ్రీకామాక్షీ విలాసము |

శ్రీమహామేరుశిఖరాగ్రవర్తినియు, సాక్షాత్శ్రీపురవాసినియు, పంచబ్రహ్మమంచాసీన శ్రీ కామేశ్వరాంకపర్యంకసమాసీనురాలును, సృష్టి స్థితి సంహార తిరోధాన అనుగ్రహ కారిణియు అయిన పరాశక్తి శ్రీ లలితామహాత్రిపురసుందరీదేవి జగత్తునందలి జీవకోటికి ధర్మాది సకల పురుషార్థములను అనుగ్రహించుటకు నిఖిలభూమండలాలంకారభూతమును, శ్రీహరిహరాది సమస్త దేవతా సాన్నిధ్యము చేత పరమ పవిత్రమైనదియును, ఈ ప్రపంచములో సకల పుణ్యక్షేత్రములకు కిరీట భూతమైనదియు అయిన కాంచీ క్షేత్రములో శ్రీ రుద్రకోటియందు శ్రీమదేకామ్రనాథనామముతో శ్రీకామేశ్వరరూపిణిగను, శ్రీపుణ్యకోటియందు వరదరాజనామముతో శ్రీమహావిష్ణుస్వరూపిణిగాను, శ్రీకామకోటియందు బిలాకాశరూపిణి కన్యారూపధారిణిగాను సమస్తమైన విశేషములతో స్వసమస్తావరణ శక్తులతో కూడి శ్రీచక్రరూపిణిగా విరాజిల్లుతున్నది.అట్టి కాంచీపురములో శ్రీకాంచ్యాం కామకోటీం కలిమలశమనీం కల్పయిత్వా సురేశే శ్రీవిద్యారాజపీఠార్చన మహిత మహారాజ్య సామ్రాజ్య లక్ష్మీం అని శ్రీ మార్కండేయసంహితలో చెప్పబడిన విధముగా జగద్గురువులైన శ్రీమచ్ఛంకరభగత్పాదాచార్యుల వారి చేత 2500 సంవత్సరములకు పూర్వము ప్రతిష్ఠించబడిన శ్రీకామకోటి శ్రీచక్రమునందు సాన్నిధ్యము అనుగ్రహించుచూ విరాజిల్లుతున్న శ్రీ కామాక్షీ అమ్మవారి బ్రహ్మోత్సవములు స్వస్తి శ్రీ శుభకృతు సంవత్సర ఫాల్గుణ-శుద్ధ-పంచమీ (అనగా 24.02.2023) శుక్రవారమునందు ఆరంభమై విశేషారాధన వేదపారాయణ సంతర్పణాది కార్యక్రమములతో నిర్దిష్టమైన విధి విధానములతో ధ్వజారోహణముతో పదకొండు దినముల పాటు వైభవోపేతముగా జరుగనున్నవి.

తతః ప్రభాతే కల్యాణీ కల్పే సావిత్ర నామకే । స్వాయంభువమనోః కాలే తమసి ప్రథమే శుభే॥
యుగే కృతాఖ్యే వైకుంఠమోహినీరూపసంయుతే। శ్రీముఖాబ్దే ఫాల్గునాఖ్యే తు మాసి కుంభగతే రవౌ॥
తత్కృష్ణ పక్ష ప్రథమా శుక్రవారారుణోదయే। మధ్యాహ్నే పూర్వఫల్గున్యాం కన్యకారూపశాలినీ ॥
లలితా రాజరాజేశీ మహాత్రిపురసుందరీ। స్వస్వరూపం సమాసాద్య బభౌ సింహాసనే శుభే॥

శ్రీ మార్కండేయపురాణాంతర్గతమైన శ్రీ కామాక్షీ విలాసములో చెప్పబడిన ప్రకారముగా బ్రహ్మోత్సవానంతరము జగన్మాత అయిన కామాక్షీ దేవి విశ్వరూపదర్శనము, తరువాత విశ్రాంతి ఉత్సవములు జరుగగలవు. కావున ఆస్తిక జనులు అందరూ శ్రీ కామాక్షీ అమ్మవారిని సేవించుకుని ఐహికాముష్మిక సకల పురుషార్థములను పొంది జన్మసాఫల్యమొనరించుకొనవలసినదిగా అభ్యర్థించుచున్నాము.

| రోజు | ఆంగ్ల దినము | మాఘమాసము | వారము | పగలు వాహన సేవ | రాత్రి వాహన సేవ | విశేషము |
|---|---|---|---|---|---|---|
| 1. | 24.02.2023 | శుక్ల పంచమీ | శుక్రవారం | ఉదయం చండీహోమము | రజతమూషికము | విఘ్నేశ్వరోత్సవము, వాస్తుశాంతి, అంకురార్పణము, మృత్సంగ్రహణము |
| 2. | 25.02.2023 | షష్ఠి | శనివారం | రజత వృషభము | స్వర్ణ హరిణము | తె : 5.15 నుండి 6.00 వరకు, మకర లగ్నమునందు ధ్వజారోహణము సాయంకాలం యాగశాల పూజారంభము |
| 3. | 26.02.2023 | సప్తమి | ఆదివారం | మకరము | చంద్ర ప్రభ | |
| 4. | 27.02.2023 | అష్టమి | సోమవారం | స్వర్ణ సింహము | గజ | ప : స్వర్ణ సింహ వాహనము, ప్రబలోత్సవము, సాయంకాలం గజవాహనము |
| 5. | 28.02.2023 | నవమి | మంగళవారం | స్వర్ణ సూర్య ప్రభ | స్వర్ణ హంస | |
| 6. | 01.03.2023 | దశమి | బుధవారం | బంగారు మేనా | నాగ | ప : మోహినీ అలంకారం |
| 7. | 02.03.2023 | దశమి, ఏకాదశి | గురువారం | ముత్యాల పల్లకి | స్వర్ణ శుకము | ప : గంధచూర్ణ వసంతోత్సవము |
| 8. | 03.03.2023 | ఏకాదశి | శుక్రవారం | రథోత్సవము | ఉ : 9.00 నుండి 10.00 వరకు మేష లగ్నములో శ్రీశంకరమఠములో | రథోత్సవము, ప. 11.00।గం పైన సాయం 5।గం వరకు రథ దర్శనం చేయదగును |
| 9. | 04.03.2023 | ద్వాదశి | శనివారం | భద్ర పీఠం | అశ్వ | |
| 10. | 05.03.2023 | త్రయోదశి | ఆదివారం | గాంధర్వ మేనా | రజత రథము | ప్రబలోత్సవము |
| 11. | 06.03.2023 | చతుర్దశి | సోమవారం | శరభము | కల్పకోద్యానం | ప : అస్త్రదేవతా మజ్జనం<br>రా : ధ్వజావరోహణం |
| 12. | 07.03.2023 | పౌర్ణమి | మంగళవారం | | స్వర్ణ కామకోటి విమానము | విశ్వరూప చందనాలంకారము |
| 13. | 08.03.2023 | బహుళ పాడ్యమి | బుధవారం | విశ్వరూప దర్శనము (ఉదయం 5।గం నుండి 7।గం వరకు) | రాత్రి విశ్రాంత్యుత్సవము ఆరంభం | |

Deepam Cards & Printers : 94434 14391

ఫాల్గుణ-శుద్ధ-పంచమీ (27.02.2023) నుండి ఫాల్గుణ-శుద్ధ-ఏకాదశీ (03.03.2023) వరకు ప్రతిదినం శ్రీశంకరభగవత్పాదులవారి దివ్యవిగ్రహ శోభాయాత్ర జరుగును.

ఎన్ త్యాగరాజన్
కార్య నిర్వాహణాధికారి (అదనపు బాధ్యత)

శ్రీకామాక్షీ అమ్మవారి దేవస్థాన పరంపరాగత అర్చక బృందం

ఎన్. సుందరేశ అయ్యర్
ఆధీన పరంపర ధర్మకర్తల శ్రీకార్యం

ఉత్సవముల సందర్భముగా వేద పారాయణములు, బాణసంచా సంరంభము జరుపబడును



శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామివారి

## జయంతి మహోత్సవ ఆహ్వానము

శ్రీ కంచి కామకోటి శంకరమఠం

ద్వారకానగర్, విశాఖపట్నం

విశేషపూజా కార్యక్రమాలు

ఫిబ్రవరి 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు

వేదిక : గోశాల, శ్రీ శంకరమఠం దగ్గర, ఉదయం 5.30ని|| నుండి

## ద్వి సహస్ర మోదక హోమం
## మహా రుద్ర హోమం
## శతచండీ హోమం

(ఫిబ్రవరి 18వ తేదీన పూర్ణాహుతి)

### సత్కారములు

వేదిక : శ్రీ కంచి కామకోటి శంకరమఠం నందు

| తేదీ | సమయం | కార్యక్రమం |
|---|---|---|
| 14 - 02 - 2023 | ఉ|| 9గంటల నుండి | వటుక పూజ |
| 15 - 02 - 2023 | ఉ|| 9గంటల నుండి | కన్యా పూజ |
| 16 - 02 - 2023 | ఉ|| 9గంటల నుండి | సువాసిని పూజ |
| 17 - 02 - 2023 | ఉ|| 9గంటల నుండి | పండిత పూజ |
| 18 - 02 - 2023 | ఉ|| 9గంటల నుండి | పండిత దంపతిపూజ |

## సాంస్కృతిక కార్యక్రమాలు

వేదిక : శ్రీ కంచి కామకోటి శంకరమఠం ఆడిటోరియం

14 - 02 - 2023 తేది

సా॥ 6.30ని॥ నుండి 8గం॥వరకు సంస్కృత హరికథ

(శ్రీ పాండురంగ హెగ్డేగారు, ముంబయి)

15 - 02 - 2023 తేది

సా॥ 6.30ని॥ నుండి 8గం॥వరకు కర్ణాటక సంగీత గాత్ర కచేరి

(శ్రీమతి పంతుల రమగారు, వైజాగ్)

(వయొలిన్ : శ్రీ ఎమ్.ఎస్. మూర్తిగారు, మృదంగం : శ్రీ వి.వి. రమణగారు)

16 - 02 - 2023 తేది

సా॥ 6.30ని॥ నుండి 8గం॥వరకు భజన్స్

(శ్రీ పట్టాభి రామపండిట్‌గారు, బెంగుళూరు)

(వయొలిన్ : శ్రీ మవుదూరి సత్యనారాయణశర్మగారు, శ్రీకాకుళం)

(మృదంగం : శ్రీ కోటిపల్లి రమేష్‌గారు, తిరుపతి)

17 - 02 - 2023 తేది

సా॥ 6.30ని॥ నుండి 8గం॥వరకు కర్ణాటక సంగీత గాత్ర కచేరి

(శ్రీ పట్టాభి రామపండిట్‌గారు, బెంగుళూరు)

18 - 02 - 2023 తేది

సా॥ 6.30ని॥ నుండి 8గం॥వరకు కర్ణాటక మాండలిన్ కచేరి

(శ్రీ యు. రాజేష్‌గారు, చెన్నై)

(మృదంగం : శ్రీ యెల్లా వెంకటేశ్వర రావుగారు, హైదరాబాద్)

(మోర్సింగ్ : శ్రీ శ్రీనివాసగోపాలన్‌గారు, హైదరాబాద్)

ఉ॥ 9గం॥ 1గం॥ వరకునుండి శ్రీ కప్పగంతుల హనుమంతుగారి బృందంచే నామ సంకీర్తనం

మ॥ 1.30ని॥ నుండి సా॥ 5గం॥ వరకు సాంప్రదాయ పాఠశాల, తిరుపతి

విద్యార్థులచే భజనలు, నామసంకీర్తనము

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

2


॥श्रीगुरुभ्यो नमः॥

॥श्रीचन्द्रमौलीश्वराय नमः॥

||Sri Chandramouleeswaraya Namaha||

**SHRI KANCHI KAMAKOTI PEETAM**

**JAGADGURU SRI SHANKARACHARYA SWAMIGAL SHRIMATAM SAMSTHANAM**



# Upcoming Visesha Pujas at Shrimatam

| | |
|---|---|
| 13th Feb., Mon. | Kalavai Paraathpara Guru Aradhana |
| 18th Feb., Sat. | HH Pujyashri Sankara Vijayendra Saraswathi Swamigal Jayanthi, Pradosha Puja, Mahashivaratri |
| 20th Feb., Mon. | Kalavai Drameshti Guru Aaradhana |
| Rathotsavams | 14th-Anusham, 16th - Moolam, 19th-Avittam, 17th - Uthradam |
| Shukravara Puja | 3rd, 10th, 17th, 24th |
| 22nd February, 2023 | Departure from Vizag to Srikakulam |
| 23rd - 26th February, 2023 | Srikakulam |
| 27th - 28th February, 2023 | Vizianagaram |
| 1st - 2nd March, 2023 | Anakapalle |
| 3rd - 7th March, 2023 | Kovvur |
| 4th March, 2023 | Aradhana of Pujya Sri Jayendra Saraswathi Shankaracharya Swamigal at Goshpada Kshetra, Kovvur |

**Shrimatam camp** is presently at **Sri Shankara Matam, Dwaraka Nagar, VISHAKAPATNAM , Andhra Pradesh**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions



త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవ దేవ ॥